సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 10 । నవంబర్ । 2024



7,670 కేసుల రాజీ

గత ఏడాది నవంబర్ 9 నుంచి ఇప్పటివరకు 7,670 కేసులను రాజీ చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. 8లో ▸



వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: ఈడూరులోని వరాల వెంకన్న ఆలయానికి కార్తీకమాసం, శ్రవణా నక్షత్రం కావడంతో శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

జాతీయ పోటీలకు ఎంపిక



తాడేపల్లిగూడెం రూరల్: దండగర్ర హైస్కూల్ వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. ఆయన్ను ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూస్‌రీల్

వీధి దీపాలకు మరమ్మతులు



మహాలక్ష్మినగర్‌లో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంపై 'వీధి దీపాల నిర్వహణ అంతంతమాత్రం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ లైటింగ్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో పట్టణంలోని మహాలక్ష్మినగర్, పాతూరు, 34వ వార్డులో నేతాజీ బొమ్మ, 18వ వార్డు పుంతలో ముసలమ్మ గుడి ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయించారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఓటర్ల సంక్షిప్త సవరణ–2025 రోల్ అబ్జర్వర్, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ సెక్రటరీ ఎంఎం నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణితో కలిసి ఓటర్ల జాబితా సవరణపై ఆయన సమీక్షించారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 2024 నాటికి జనాభా అంచనా సుమారు 20,25,599 మంది ఉన్నారన్నారు. జిల్లాలో ఓటర్లు 14,71,189 మంది ఉన్నారన్నారు. జిల్లాలోని 929 ప్రాంతాల్లో 1,461 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఏడుగురు ఈఆర్వోలు, 44 మంది ఏఈఆర్వోలు పనిచేస్తున్నారన్నారు.

ప్రజలకు చేరువలో ఇసుక

భీమవరం (ప్రకాశంచౌక్): ఉచిత ఇసుకను ప్రజలు మరింత చేరువచేయడమే లక్ష్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆర్డీఓలు, తహసీల్దార్లు, ట్రాన్స్‌పోర్టర్లతో ఆమె సమావేశమయ్యారు. వినియోగదారులు తక్కువ ధరకు ఇసుకను పొందేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పెదవేగి: ప్రతి విద్యార్థి గెలుపే లక్ష్యంగా క్రీడల్లో పాల్గొనాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి (డీవీఈఓ) బి.ప్రభాకరరావు సూచించారు. శనివారం ఎంఆర్సీ కాలనీలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన 13 జిల్లాల బాలురు, బాలికల జట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలు ప్రతి విద్యార్థికి ముఖ్యమని, క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ కో– ఆర్డినేటర్ కె.జయరాజు, పీడీ గురుమూర్తి, జిల్లాల నుంచి వచ్చిన పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన కొత్త పే స్కేలులోని సమస్యలను పరిష్కరించడంలో సత్వర చర్యలు చేపట్టాలని, త్వరితగతిన మెడికల్ పాలసీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ మహేశ్వరరెడ్డి అన్నారు. అసోసియేషన్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నగరంలో నిర్వహించారు. అసోసియేషన్ ఏలూరు, పశ్చి మ గోదావరి (భీమవరం) సర్కిళ్లకు నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా ఏకగ్రీవమయ్యాయి. భీమవరం సర్కిల్ అధ్యక్షుడిగా ఎ.సతీష్, కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా జీవీజీ రవిశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.సుబ్రహ్మణ్యం, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.సంఘమిత్ర, బిల్డింగ్ సెక్రటరీగా వి.ప్రసాద్ రాజు ఏకగ్రీవమయ్యారు. ఏలూరు సర్కిల్ అధ్యక్షుడిగా ఆర్.భీమేశ్వరరావును ఎన్నుకున్నారు.

సీనియర్లకు మరో 'సారీ'

నామినేటెడ్ పదవుల్లో మొండిచేయి

- రెండో జాబితాలోనూ నిరాశే
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులకు నో చాన్స్
- ముగ్గురు జనసేన నేతలకు అవకాశం
- ఎమ్మెల్యే సీట్లు త్యాగం చేసిన నేతలకు భంగపాటు
- అంతర్మథనంలో టీడీపీ నేతలు





తోట సీతారామలక్ష్మి



గన్ని వీరాంజనేయులు



ముద్దరబోయిన



వలవల బాబ్జీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: నామినేటెడ్ పదవుల భర్తీలో సీనియర్లకు సీఎం చంద్రబాబు మళ్లీ షాక్ ఇచ్చారు. పొత్తుల్లో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి యథావిధిగా మొండిచేయి చూపడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇక జనసేనలోనూ క్రియాశీలకంగా ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సామాజిక కోణంలో పదవులు భర్తీ చేశారు. శనివారం ప్రకటించిన రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నేతకు కేబినేట్ హోదా కలిగిన పదవి, ఇద్దరు జనసేన నేతలకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, మరోనేతకు జోన్ చైర్మన్ పదవి దక్కింది. ఇక ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, తోట సీతామహాలక్ష్మిలకు మొండిచేయి చూపడం టీడీపీలోనే తీవ్ర చర్చకు దారి తీసింది.

అప్పుడు ఇద్దరు.. ఇప్పుడు నలుగురు

తొలి విడతలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం కల్పించగా రెండో విడతలో నలుగురికి నామినేటెడ్ యోగం కలిగింది. నరసాపురం నియోజకవర్గం నుంచి ఇద్దరు నేతలకు పదవులు దక్కాయి. వీరిలో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా టీడీపీకి చెందిన మహమ్మద్ షరీఫ్‌కు కేబినేట్ ర్యాంక్ కల్పించగా, రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన కొత్తపల్లి సుబ్బారాయుడు ఉన్నారు. భీమవరం జనసేనకు చెందిన వి.సూర్యనారాయరాజుకు రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఏలూరుకు చెందిన జనసేన పార్టీ నేత రెడ్డి అప్పలనాయుడుకు ఏపీఎస్ఆర్‌టీసీ విజయవాడ జోన్ చైర్మన్‌గా పదవులు దక్కాయి.

సీనియర్లకు భంగపాటు

ఎన్నికల ముందు కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా టికెట్ దక్కని ఆశావాహులను బుజ్జగించేందుకు టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎమ్మెల్సీలు, ఇతర నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని ఎర చూపారు. నరసాపురంలో జనసేన పోటీ చేయగా అక్కడ టీడీపీ నుంచి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజరామ్మోహననాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, భీమవరంలో టీడీపీ నాయకురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, తాడేపల్లిగూడెంలో టీడీపీ నేత వలవల బాబ్జి, ఉండి నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి జుత్తుక నాగరాజు, పాలకొల్లులో జనసేన ఇన్‌చార్జి బోనం చినబాబు, దెందులూరు జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, ఉంగుటూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీకి చెందిన గన్ని వీరాంజనేయులు, నూజివీడు నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, కైకలూరు నియోజకవర్గం నుంచి బొమ్మనబోయిన విజయలక్ష్మి, కమిలి విఠలరావు, వెంకటేశ్వరరాజు తదితర నేతలతో నేరుగా, ఫోన్లలో సంప్రదింపులు జరిపారు. అందరూ కలిసికట్టుగా కూటమి విజయానికి పనిచేయాలని కోరారు. కూటమి అధికారంలోకి రావడంతో గత ఐదు నెలలుగా నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం వీరంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. నెలరోజుల క్రితం తొలి విడత జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు ఏపీఐఐసీ చైర్మన్‌గా, చింతలపూడి నుంచి మాజీ మంత్రి పీతల సుజాతకు ఏపీ వినియోగదారుల కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా పదవి దక్కింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల హామీలతో ఈసారైనా తమకు పదవీ యోగం ఉంటుందని గంపెడాసతో ఉన్న మిగిలిన వారికి మరోసారి నిరాశే ఎదురైంది. అధినేత మాట విని కష్టపడి మిత్రపక్ష అభ్యర్థిని ఎమ్మెల్యే చేస్తే తమకు గుర్తింపు లేకుండా పోయిందని సన్నిహితుల వద్ద వారు వాపోతున్నారు. ప్రతిపక్షంగా ఐదేళ్ల పాటు ఇబ్బందులు పడి నియోజకవర్గంలో, జిల్లాలో పార్టీని నెట్టుకుని వస్తే అధికారంలోకి వచ్చాక పదవులను వేరొకరు ఎంజాయ్ చేస్తున్నారని మదనపడుతున్నారు.

నకిలీ వైద్యుడి కలకలం



తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న వైద్యాధికారి

పెనుగొండ: మండలంలోని సోమరాజు చెరువులో నకిలీ వైద్యుడి వ్యవహారం వెలుగుచూసింది. గ్రామంలో కె.కృష్ణ తేజ అనే వ్యక్తి వైద్యుడినంటూ ఏడాదిన్నరగా మోకాలి నొప్పులకు వైద్యం చేస్తున్నారు. ఓ రోగి ఉదంతంతో అధికారులు తనిఖీ చేయగా కృష్ణతేజ వైద్యుడు కాదని, కనీస అర్హత కూడా లేదని తేలింది. కృష్ణతేజ ఎటువంటి అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఇటీవల మందుల షాపు ప్రారంభించి దీనికి అనుగుణంగా ఆస్పత్రిని నడుపుతున్నారు. దీనికి భారీగా ముడుపులు చేతులు మారినట్టు సమాచారం. ఇదిలా ఉండగా కృష్ణతేజ మత్తు డాక్టర్ లేకుండా తాను మత్తు ఇచ్చి స్టెరాయిడ్స్‌తో వైద్యం చేస్తున్నారని బాధితులు తెలిపారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి వినోద్‌కుమార్ శనివారం సోమరాజు చెరువులో మందుల షాపు, ఆస్పత్రిని తనిఖీ చేశారు. అధిక సంఖ్యలో స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్లు గుర్తించారు. మందుల షాపు మూసేయాల్సిందిగా ఆదేశించామని, పూర్తి నివేదికను జిల్లా వైద్యాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. నకిలీ వైద్యుడిపై గతంలోనే ఫిర్యాదులు అందినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా కొందరు రోగులు కృష్ణతేజకు మద్దతు పలకడం విశేషం.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లపై

తప్పుడు కేసులు



జిల్లా ఎస్పీ కార్యాలయానికి బాధితులతో కలిసి వచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి, సమన్వయకర్తలు ఉమాబాల, పీవీఎల్, నాయకులు

- సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్‌లు
- ఆందోళనలో కుటుంబసభ్యులు
- భీమవరంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు
- పార్టీ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు ముదునూరి భరోసా

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం పోలీసు విచారణ పేరిట వేధింపులు, ఇబ్బందులు పెట్టడం ఆందోళన కలిగిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం ఆయన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా ముఖ్య నాయకులతో కలిసి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల ముందుకు తీసుకువెళుతున్న వారిపై కేసులు పెట్టి వేధించడం వారి కుటుంబ సభ్యులను ఆందోళన కలిగిస్తోందన్నారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. అయితే జిల్లాలోని భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురంలో తమ పార్టీ కార్యకర్తలను పోలీసులు విచారణ పేరిట పలు ప్రాంతాలకు తిప్పుతూ కనిపించకుండా చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు, కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

కేసులు దారుణం : మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ హామీల గురించి సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తుంటే రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ శ్రేణులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. జిల్లాలో తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై కేసులు వేసి బాధితులకు అండగా ఉంటామన్నారు. ఉండి సమన్వయకర్త పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ తమ నియోజవర్గంలోని ఏలూరుపాడుకు చెందిన సత్యనారాయణ అనే కార్యకర్త ఇంటిపై టీడీపీ నాయకులు దాడి చేసి అతడి చేయి విరగ్గొట్టారన్నారు. పోలీసు కేసు పెడితే అసలు నిందుతులను వదిలి వేరే వ్యక్తులను కేసులో పెట్టారన్నారు. దీనిపై ఎస్పీకి తెలియజేస్తే న్యాయం చేస్తామని చెప్పారన్నారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల మాట్లాడుతూ భీమవరంలో సోషల్ మీడియా కన్వీనర్ జయరాంను విచారణ పేరిట అక్రమ నిర్బంధంలో ఉంచడాన్ని ఖండిస్తున్నామన్నారు. జగన్, ఆయన కుటుంబంలోని మహిళలపై నీచమైన పోస్టుల పెట్టిన వారి వివరాలను ఎస్పీకి అందించామన్నారు. పార్టీ నాయకులు పేరిచర్ల నరసింహరాజు, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, పద్మారాజు, పెనుమత్స విశ్వనాథ రాజు, పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పెనుమత్స ఆంజనేయరాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, అంబటి రమేష్, గుండా సుందరరామినాయుడు, గుర్రం బెనాహర్, జనార్దనరాజు, వరం, శ్రీను, బొచ్చ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా సమస్యలపై పోరాటం

- సమన్వయ కమిటీల ద్వారా పార్టీ బలోపేతం
- వైఎస్సార్‌సీపీది ప్రజాపక్షం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు వెల్లడి



ఉండి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న ప్రసాదరాజు, సమన్వయకర్తలు

కాళ్ల: అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల పక్షాన ఉండేది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీ ఏర్పడినప్పటి నుంచి గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సమన్వయ కమిటీలను పునర్నిర్మించాలనే సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఓ పక్క పార్టీని బలోపేతం చేసుకుంటూ మరోపక్క ప్రజల తరఫున పోరాటం చేస్తుందన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామన్నారు. కమిటీల నిర్మాణం, సభ్యత్వ నమోదులు చేయించి ప్రతి కార్యకర్తకూ బీమా సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

ప్రతినెలా సమావేశాలు : ప్రతినెలా తప్పనిసరిగా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రసాదరాజు అన్నారు. ప్రతి మూడు నెలలు ఒకసారి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఆరు నెలలకు జిల్లా, రాష్ట్ర స్థాయి సమావేశాలు ఏర్పాటుచేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రజల ఇబ్బందులు, పార్టీ నిర్మాణం వంటి విషయాలను రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజలు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజల ఇబ్బందులపై సంఘటితంగా పోరాటం చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మాజీ మంత్రి కారు మూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, పెనుమత్స దుర్గా ప్రసాద్‌రాజు, జెడ్పీటీసీలు వేగేశ్న వెంకటరాజు, పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థుల కనకదుర్గ మ హంకాళి, ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, కటారి జయలక్ష్మి, భూపతి రాజు చంటిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, గుండా సుందరామూర్తినాయుడు, అంబటి రమేష్, జి.సుందర్ కుమార్ పాల్గొన్నారు.

ఏడుగురికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఏడుగురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఏలూరు జిల్లా నుంచి ఎస్.పెద్దిరాజు (ఉంగుటూరు), కూనాటి జాన్ (కైకరం), బీఏస్ఎన్ కళ్యాణి (దెందులూరు), గుగ్గులోతు కృష్ణ (ఏలూరు), పశ్చిమగోదావరి జిల్లా నుంచి బీఎల్ నరసింహమూర్తి (వడలి), వీవీఎస్ఎస్ నాగలక్ష్మి (నరసాపురం), పి.పోలారావు (యర్రాయి చెరువు) ఎంపికైన వారిలో ఉన్నారు. ఈనెల 11న అవార్డుల ప్రదానం ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఎంపికైన వారు పురస్కారం అందుకునే అవకాశం లేదు.

కేసు పెట్టి.. కక్షగట్టి..

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లపై వేధింపులు
- జిల్లా కన్వీనర్ జయరామ్ అరెస్ట్
- వారం రోజులుగా పోలీసుల అదుపులోనే..
- మూడు రోజులపాటు రహస్య ప్రాంతంలో విచారణ



జయరామ్‌ను కోర్టుకు తీసుకువెళుతున్న పోలీసులు

సాక్షి, భీమవరం: భీమవరానికి చెందిన బగ్గు జయరామ్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు ఈనెల 3న ఉదయం 6 గంటల సమయంలో జయరామ్ ఇంటికి వచ్చి ఆయన్ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజు రాత్రి సమయంలో 321, 153 (ఏ), 505 (2), 67 ఆఫ్ ఐటీ యాక్టు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి పంపారు. 4న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచారు. 5న ఉదయం స్టేషన్‌కు తీసుకువెళ్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో 41 నోటీస్ ఇచ్చి స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టారు. మరలా 6న ఉదయం పోలీసులు వచ్చి జయరామ్‌ను తీసుకువెళ్లి రహస్య ప్రాంతంలో ఉంచారు. తర్వాత మూడు రోజులుగా ఆయన ఆచూకీ తెలియకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు హైకోర్టులో పిల్ వేయడంతో శనివారం హడావుడిగా స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు కబురు పంపారు. అనంతరం సాయంత్రం జయరామ్‌ను కోర్టులో హాజరుపర్చారు.

ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు

ఈ ఏడాది ఏప్రిల్ 13న జయరామ్ తన సోషల్ మీడియా ఖాతాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను విమర్శిస్తూ, రాజకీయ పార్టీల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినట్టు జనసేన పార్టీ భీమవరం టౌన్ సెక్రటరీ పత్తి హరివర్ధన్‌రావు ఈనెల 3న ఫిర్యాదు చేసినట్టు పోలీసులు డైలీ స్టేషన్ రిపోర్టు (డీఎస్ఆర్)లో పేర్కొన్నారు. ముద్దాయి కావాలనే కులమతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఉద్దేశంతో ఇలా చేస్తున్నందున చర్యలు తీసుకోవాలని కోరినట్టు డీఎస్ఆర్‌లో నమోదుచేశారు.

రాజకీయ దురుద్దేశంతోనే..

జయరామ్ పోస్టులో కులాలు, వర్గాలకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేకపోగా ఈ ఏడాది మే 12 నుంచి తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఎలాంటి పోస్టులను అప్‌లోడ్ చేయలేదు. కాగా రాజకీయ దురుద్దేశంతో పాత పోస్టు పేరిట ఫిర్యాదు చేసి జయరామ్‌పై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వన్‌టౌన్ పోలీసులు రిమాండ్ కోరగా సెకండ్ ఏడీఎం కోర్టు తిరస్కరించి స్టేషన్ బెయిల్ ఇవ్వమని పంపించింది. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్టేషన్ బెయిల్ తీసుకోవడంతో జయరామ్ శనివారం రాత్రి విడుదలయ్యారు.

మురుగు కాలువ గట్టునూ మింగేశారు

కూటమి నేతల కబ్జాలపర్వం



కాళ్లలో రుద్రాయకోడు మురుగు కాలువ గట్టును తవ్విన దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలంలో అధికార పార్టీ నేతల అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. మండల కేంద్రం కాళ్ల గ్రామ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రుద్రాయకోడు మురుగు కాలువ గట్టుని గ్రామానికి చెందిన మట్టి వ్యాపారి, అధికార పార్టీ నేత అక్రమంగా తవ్వి స్థలం పూడిక చేపట్టారు. అయితే కనీసం అధికారులు అటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. కాళ్లకు చెందిన మట్టి వ్యాపారి రుద్రాయకోడు మురుగుకాలువ గట్టును సుమారు 3 అడుగుల లోతు వరకు పొక్లయిన్‌తో తవ్వి మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల డ్రెయిన్ గట్ల పటిష్టతను అధికారులు పరిశీలించారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ నాయకులు గట్టు తవ్వకం చేపట్టడం అనుమానాలకు తావిస్తోంది. తవ్వకాలతో గట్టు బలహీనపడి విపత్తుల సమయంలో గండి పడితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆకివీడు డివిజన్ డ్రైనేజీ శాఖ ఏఈ జి.ప్రసాద్‌ని వివరణ కోరగా డ్రెయిన్ గట్టు తవ్వకం విషయం తన దృష్టికి వచ్చిందని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

వీధి కుక్క స్వైర విహారం


స్థానిక సంతపేటలో వీధికుక్క కరిచి బాలికకు గాయాలు

ఆకివీడు : పట్టణంలో వీధి కుక్క స్వైర విహారం చేసి ఏడేళ్ల బాలిక, మహిళను గాయపరిచింది. శనివారం స్థానిక సంతపేటలో ఆడుకుంటున్న షేక్ నసీమాపై దాడి చేసి దవడ, చేతిపైన కరిసింది. అదే ప్రాంతంలోని మరో మహిళ ఎస్.లక్ష్మిపై దాడిచేసి గాయపరిచింది. నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రతీ వీధిలోనూ పదుల సంఖ్యలో కుక్కలు పెరిగిపోయాయి. పగలే మనుషులపై దాడిచేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల నగర పంచాయతీకి కూడా ఫిర్యాదు చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

చాట్రాయి: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన కోరుకొండ ప్రసాదు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో దాడి చేసి 37 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అరెస్టయిన వ్యక్తి స్థానిక టీడీపీ కార్యకర్త, హైస్కూలు విద్యాకమిటీ చైర్మన్ కావడం గమనార్హం.

రెజ్లింగ్ పోటీల్లో గెలుపు

దెందులూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించింది. విజయవాడలో శనివారం జరిగిన నేషనల్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల ఆటల పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టులో దెందులూరు మండలం పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు ఉన్నారు.

ఉమ్మడి పశ్చిమలో 7,670 కేసుల రాజీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్) : గత ఏడాది నవంబర్ 9 నుంచి ఇంతవరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 7,670 కేసుల్ని రాజీ చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ పురుషోత్తం కుమార్ అధ్యక్షతన శనివారం న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు నిర్వహించడం, చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, పేద ప్రజలు, స్త్రీలు, పిల్లలకు, విభిన్న ప్రతిభావంతులు, ప్రకృతి వైపరీత్యాలకు లోనైన ప్రజలకు ఉచిత న్యాయ సాయం అందిస్తున్నామని తెలిపారు. గత నవంబర్ 9 నుంచి నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 7,670 కేసులు రాజీ చేశామని, ఇందులో 6,448 క్రిమినల్ కేసులు, 690 సివిల్ కేసులు, 532 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 634 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కె.కె.వి.బుల్లి కృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బి.జె.రెడ్డి, ట్రైనీ మాస్టర్ టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్వా నూతన కార్యవర్గం ఎన్నిక


ఆప్వా నూతన కార్యవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సతీష్, కోశాధికారి సుబ్రహ్మణ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : ఆక్వా ప్రొఫెషన్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆప్వా) నూతన కార్యవర్గాన్ని శనివారం భీమవరం ఆప్వా కార్యాలయంలో ఎన్నుకున్నారు. అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అమర్నేని శ్రీనివాస్ (మైక్రాల్ శ్రీనివాస్) అధ్యక్షతన జరిగిన కోర్ కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా తేతలి శ్రీనివాస్, (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా బోడపాటి విజయసతీష్ కుమార్ (భీమవరం), కోశాధికారిగా పలసాల వెంకట సుబ్రహ్మణ్యం (భీమవరం)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తేతలి శ్రీనివాస్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ఆప్వా ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను కొనసాగిస్తూనే సంస్థలో మరి కొంతమందిని సభ్యులుగా చేర్చుకోడం ద్వారా దేశవ్యాప్తంగా బలోపేతం చేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి బోడపాటి సతీష్ మాట్లాడుతూ క్రమ తప్పకుండా ప్రతి రెండు, మూడు నెలలకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

క్రైస్తవ సభలకు అనుమతి నిరాకరణ

తణుకు: తణుకు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రైస్తవ సభల నిర్వహణకు అనుమతులు లేవని అధికారులు ఆదేశాలు జారీ చేయడం పట్ల తణుకు ఏరియా పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి తణుకులో ధర్నా నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బహిరంగ సభల నిర్వహణకు అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం సాయంత్రం సభ ప్రారంభమయ్యే సమయానికి అనుమతులు లేవంటూ ప్రధాన గేటుకు తాళం వేశారు. దీంతో పాస్టర్ల అసోసియేషన్ నాయకులు, పాస్టర్లు, విశ్వాసులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళనకు దిగారు. రాష్ట్రపతి రోడ్డుపై రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తహసీల్దార్ అశోక్‌వర్మ మాట్లాడుతూ జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో మతపరమైన కార్యక్రమాలకు అనుమతులు లేవని, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని చెప్పారు.

బాలిక పట్ల అసభ్యకర ప్రవర్తనపై కేసు

ఉండి: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెలివర్రు గ్రామానికి చెందిన బాలిక పట్ల అదే ప్రాంతానికి చెందిన దర్శి అబ్రహాం అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్టుషాపులపై దాడులు

ఏలూరు టౌన్: జిల్లాలో బెల్టు షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య తెలిపారు. 7 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత వారం రోజులుగా నిర్వహించిన దాడుల్లో 95 కేసులు నమోదు చేయగా 78 మందిని అరెస్టు చేశామన్నారు. 30 సారా కేసుల్లో 13 మందిని అరెస్టు చేశామన్నారు.

ఉల్లిబాంబు పేలుడు ఘటనలో మరొకరి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో దీపావళి రోజు ఉల్లి నాటుబాంబులు పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న ఏలూరు తూర్పువీధికి చెందిన మల్లా పెద్దిరాజు (65) శనివారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న దుర్గసి సుధాకర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఏడుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్న పెద్దిరాజు శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

క్లుప్తంగా

ప్రీ రిపబ్లిక్ క్యాంపునకు విద్యార్థిని ఎంపిక


ప్రీ రిపబ్లిక్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తణుకు టౌన్‌: మహారాష్ట్రలోని బెల్గాంలో నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ క్యాంపునకు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థిని జి. స్వాతిక ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరిబాయి శనివారం తెలిపారు. గత నెలలో ఆది కవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ సెలెక్షన్స్‌లో స్వాతిక ఎంపికై నట్లు తెలిపారు. స్వాతికను కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కేవీ శ్యామలదేవి, సీహెచ్ రమేష్ బాబు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

నేడు కోత పండుగ

పెంటపాడు: తాడేపల్లిగూడెం టౌన్ ఎ.క్లాష్ ఫ్యారిష్ చర్చిలో ఆదివారం కోత పండుగ నిర్వహించనున్నట్టు సంఘం గురుమండల అధ్యక్షుడు ఫీనెహాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆరాధన దృష్ట్యా స్టాల్స్ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సంఘ సభ్యులు సమయాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు

అయ్యప్ప స్వామి కలశ పూజకు ఏర్పాట్లు


విశేషాలంకరణలో అయ్యప్ప స్వామి

తణుకు అర్బన్‌: తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 10న కలశ పూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి వేమూరి చలపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి స్వామికి విశేషాలంకరణ, అభిషేకాలు నిర్వహిస్తామని, 108 కలశాలతో నిర్వహించే కలశ పూజ ఈ ఏడాది మాల ధరించిన 108 కన్నె స్వాములతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

తణుకు: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో శనివారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సైలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి, సిబ్బంది ఆధ్వర్యంలో దాడి చేసి గుండాబత్తుల వెంకటేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేడు మానవత సమావేశం

పెంటపాడు: గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని మానవత జిల్లా నాయకుడు తాడేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెంటపాడు, గణపవరం, ఉండి, నిడమర్రు మండలాల్లోని పీఏస్‌టీలు, మండల బాధ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

గూడెంలో 19 నుంచి చదరంగం పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ అండర్–13 ఓపెన్ అండ్ బాలికల చదరంగం పోటీలు స్థానిక గుణ్ణం వేణుగోపాల ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు అకాడమి చైర్మన్ సీహెచ్ఏఆర్‌కే వర్మ, కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. పోటీల బ్రోచర్‌ను శనివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బొలిశెట్టి రాజేష్, మాస్టర్ చెస్ అకాడమి సభ్యులు విడుదల చేశారు. పోటీలకు 13 సంవత్సరాల లోపు క్రీడాకారులు సుమారు 200 మంది రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరుకానున్నట్టు తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 94408 67370లో సంప్రదించాలని కోరారు.

మార్చురీకి వ్యక్తి మృతదేహం


తణుకు ఆసుపత్రిలోని మృతదేహం

తణుకు: అత్తిలి రైల్వేస్టేషన్‌లోని రైల్వే విద్యుత్ స్తంభంపై నుంచి పడి మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు భీమవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ లచ్చన్న తెలిపారు. మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి అత్తిలి రైల్వేస్టేషన్‌లోని విద్యుత్ స్తంభం ఎక్కి ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. మృతుడు తమిళనాడుకి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9705649492 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డుపై దుకాణాలు.. ట్రాఫిక్ ఇక్కట్లు



అత్తిలి మండలం ఈడూరు వరాల వెంకన్న ఆలయం ఎదురుగా ఉన్న మలుపు వద్ద ట్రాఫిక్‌తో అవస్థలు పడుతున్న భక్తులు

- రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు
- ఈడూరులో ప్రతి శనివారం భక్తుల అవస్థలు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ మలుపు వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుల్లి వరాల వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతి శనివారం పరిసర గ్రామాల నుంచి కాలినడకన, ద్విచక్ర, ఆటోలు, బస్సులపై పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు వెంబడి భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బస్సులు, ఆటోలపై రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆలయం ఎదురుగా ఉన్న మలుపు వద్ద కొబ్బరికాయలు, అరటి పండ్లు, పూజా సామగ్రి దుకాణాలు రోడ్డు మార్జిన్ వెంబడి ఏర్పాటు చేశారు. ఆ మలుపు వద్దే భక్తులు వేచి ఉండి ఆటోలు, బస్సులపై ప్రయాణిస్తుంటారు. దీంతో ఇక్కడ ప్రతి శనివారం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్సులు, ఆటోల కోసం ఈ మలుపు భక్తులు వద్ద వేచి ఉండటంతో ఒక్కోసారి వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులపై దూసుకువచ్చిన సందర్భాలున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపు వద్ద రోడ్డు మార్జిన్ వెంబడి ఉన్న దుకాణాలను వెనుకకు తరలించి, ట్రాఫిక్ సమస్యలేకుండా, ప్రమాదాలబారిన పడకుండా పంచాయతీ అధికారుల చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ దోహదం

తణుకు టౌన్‌: విద్యార్థుల్లో ప్రతికూల పరిస్థితుల్లో కూడా సమయస్ఫూర్తితో వ్యవహరించే నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ దోహదం చేస్తుందని ఏఎస్ఆర్ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆకుల రమాకుమారి చెప్పారు. తణుకు రూరల్ మండలం తేతలిలోని స్టెప్పింగ్ స్టోన్స్ హైస్కూల్లో మూడు రోజుల పాటు నిర్వహించే హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహించిన వివిధ సాహస కృత్యాలను రమాకుమారి ప్రారంభించారు. ఏఎస్ఆర్ విద్యా సంస్థల ఎండీ డాక్టర్ ఆకుల విమల మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అడ్వంచర్ శిబిరాలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు ఐక్యతా భావం, స్నేహ సంబంధాలు ఏర్పడతాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల సహాయ కృత్యాలను నిర్వహించారు. స్టేట్ చైర్మన్ రావి ముత్యాలరాజు, స్టేట్ చీఫ్ కమిషనర్ రామ గంగాధర్, స్టేట్ కార్యదర్శి ఏవీఆర్ నరేష్ బాబు, కర్ణాటక, కేరళకు చెందిన నిర్వాహకులు ఎస్ శ్రీధరన్, ఎం దీపిక, బిందేతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త ఫుల్.. సంపద నిల్!


ఇరగవరంలో రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్త


ఇరగవరంలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

- కొరవడిన చెత్త సంపద కేంద్రాల నిర్వహణ
- మూలకు చేరుతున్న విలువైన యంత్రాలు

ఇరగవరం: చెత్త సంపద కేంద్రాల నిర్వహణ కొరవడింది. దీంతో విలువైన యంత్రాలు మూలకు చేరుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణలో భాగంగా చెత్తను సేకరించి వాటి ద్వారా రీసైక్లింగ్ విధానం కోసం కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రతి పంచాయతీలో ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేసినచెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వాహణ కొరవడుతోంది. వీధుల నుంచి సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేసి వీటి ద్వారా వానపాములతో సేంద్రియ ఎరువులుగా మార్చి రైతులకు విక్రయించి ఆదాయం పొందాలి. మరో వైపు మిగిలిన పొడి చెత్త, సీసాలు, పాలిథిన్ తదితర వాటిని వేరు చేసి విక్రయించగా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాకు జమ చేయాలి. అయితే నియోజకవర్గంలో ఇటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెత్త ఫుల్‌గా సంపద నిల్ గా మారుతోంది.

పాడవుతున్న యంత్రాలు

తణుకు నియోజకవర్గంలో తణుకు టౌన్, రూరల్, ఇరగవరం, అత్తిలి తదితర పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ నియమించిన ఒక్కొక్కరికీ నెలకు రూ.ఆరువేలు వేతనాలు కేటాయించారు. కొన్ని పంచాయతీల్లో క్లాప్ మిత్రులకు పూర్తిస్థాయిలో వేతనాలు అందడంలేదు. అయా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడంలేదు. మేజర్ పంచాయతీల్లో సేకరించిన చెత్తను డంపింగ్ కేంద్రాలను తరలిస్తున్నారు. దీంతో కొన్ని విలువైన యంత్రాలు మూలకు చేరుతున్నా యి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలనే లక్ష్యం నీరుగారిపోతుంది.

పర్యవేక్షిస్తాం

తణుకు డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం. ఈ కేంద్రాల ద్వారా లక్ష్యం నెరవేరే విధంగా చూస్తాం. ఈ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఉన్నతాధికారులను నుంచి ఆదేశాలు ఉన్నాయి.

– నరసింహమూర్తి, ఇరగవరం, ఈవోపీఆర్డీ

మధుమేహ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి


మధుమేహ వ్యాధి బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రం విడుదల చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లయన్స్ మాకా శ్రీనివాసరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో వాకర్స్‌కు లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. షుగర్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రం విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 54 కోట్ల మంది షుగర్ వ్యాధితో బాధపడుతుంటే.. అందులో 7.4 కోట్ల మంది భారతీయులే ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. ప్రీ డయాబెటీస్ (ముందస్తు మధుమేహం)లో సుమారు 8 కోట్ల మంది భారతీయులు ఉన్నట్టు అంచనా అన్నారు. క్లోమ గ్రంధి, ఇన్సులిన్, జన్యుపరమైన అంశాలు, వంశపారంపర్యం, జీవన శైలిలో మార్పులు, మధుమేహ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పేరిచర్ల వీరభద్రరాజు, కంతేటి శివరామరాజు, ఆయుర్వేద వైద్యులు కంచర్ల నరసింహం, లయన్ సభ్యులు సతీష్, నార్ని చిన్ని, డి.ముఖర్జీ, యర్రా ఆంజనేయస్వామి, మానేపల్లి కిరణ్, అపర్ణ ప్రసాద్, బెజవాడ రాంబాబు, గుప్తా, ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న రఘురామ్‌నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్‌: రాజకీయాలకు అతీతంగా అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు కోరారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన జాలపర్తి రాజు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రేకులతో ఇంటి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని రఘురామ్ నాయకుడు హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని చెప్పారు. జాలపర్తి రాజు కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, మాకరాజు సతీష్, మాకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రెడ్డి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మార్లపూడి సుబ్బారావు, దారపురెడ్డి శ్రీనివాస్, వీరమల్ల వెంకన్న, కాసాని పండు, భోగిల్లి రాంబాబు, కొండుబోయిన కృపావరం, ఉర్ల నవీన్, రావి రాఘవ, బొట్టా గంగారావు, అయినపర్తి పేతురు, గాలింకి శ్రీను, పెనుమాక సుబ్బారావు, శీలి రాజేష్, శీలి శ్యామ్‌కుమార్, గాలింకి సతీష్, చిన్ని శ్రీను పాల్గొన్నారు.

నాగశ్రావణి అత్తమామల ఇంటి వద్ద నిరసన


నాగశ్రావణి అత్తమామల ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆమె తల్లిదండ్రులు

తాడేపల్లిగూడెం రూరల్‌: అత్తమామల చేతిలో హత్యకు గురైన తమ కుమార్తె ఆత్మకు శాంతి కలిగించాలని నాగశ్రావణి తల్లిదండ్రులు మేడూరి శ్రీనివాస్, సత్యకుమారి దంపతులు కోరారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో నాగశ్రావణి ఆరు నెలల క్రితం హత్యకు గురైన విషయం విదితమే. ఈ క్రమంలో గ్రామ పెద్దల సమక్షంలో నాగశ్రావణి ఇద్దరు పిల్లలకు ఆస్తిలో వాటా ఇస్తామని ఆమె భర్త శ్రీనివాసరావు, అత్తమామలు లక్కోజు కేశవరావు దంపతులు అంగీకరించారు. ఆరు నెలలు గడిచినా ఆ హామీని అమలు చేయకపోవడంతో శనివారం నాగశ్రావణి తల్లిదండ్రులు జగన్నాథపురంలో ఆమె అత్తారింటి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురజాడ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం గ్రామ పెద్దలు ఉండ్రాజవరపు రాజు, ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు నార్ని రవికాంత నాగేశ్వరరావు, పుల్లా అన్నవరం, బీజేపీ నాయకుడు తమ్మాబత్తుల ధనరాజులకు వినతి పత్రాలు అందజేశారు. గ్రామ ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు లక్కోజు సుబ్రహ్మణ్యం, కాశీ శ్రీనివాసరావు, ముసినాని సత్యనారాయణ, పండూరి శ్రీనివాస్, పొన్నాడ సత్యనారాయణ, గిరిజాల రాఘవులు, జనసేన నాయకుడు కోపల్లె జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలి


తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఉచిత ఇసుక విధానం హామీని సక్రమంగా అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం రాష్ట్ర వ్యాప్త ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా తణుకు కప్పల వెంకన్న సెంటర్, నరేంద్ర సెంటర్, గణేష్ చౌక్‌ల వద్ద కరపత్రాలు పంపిణీ చేసి గ్రూప్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ప్రతాప్ మాట్లాడుతూ ఇసుక ధరకు రెక్కలు రావడంతో ఇంటి నిర్మాణాలు లేక, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డబ్బులు ఉన్నవారికే బ్లాక్ మార్కెట్ వ్యవస్థ ద్వారా ఇసుక దొరుకుతోందని, పేదలకు ఇసుక దొరకడం లేదన్నారు. ఇసుక కొరత కారణంగా అటు భవన నిర్మాణదారులు, ఇటు కార్మికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనతీతంగా ఉన్నాయన్నారు. అందరికీ ఇసుక అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని ప్రతాప్ డిమాండ్ చేశారు. 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, గంగ, అంజి, శ్రీనివాసరావు, నాగరాజు, చంటి, సత్యనారాయణ, జనార్దన్, శ్రీను, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి


నిట్‌లో మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణులు రవికాంత్

తాడేపల్లిగూడెం : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉంటే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనే సామర్థ్యం వస్తుందని విశాఖ పట్టణానికి చెందిన మానసిక వైద్య నిపుణుడు బి.రవికాంత్ అన్నారు. శనివారం నిట్‌లో నిర్వహించిన మీట్ యువర్ కౌన్సిలర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చదువు, పరీక్షల కారణంగా కొందరు విద్యార్థులు తీవ్ర ఒత్తిడి, గందరగోళానికి గురై మానసిక కుంగుపాటుకు లోనవుతున్నారని వివరించారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి విద్యార్థీ కొంతసేపు యోగ, వ్యాయామం, పరుగు, నడక, వంటి వాటికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. పుస్తకాలు చదవడం, రాయడం, సంగీతం వినడం, ద్వారా మెదడు చురుగ్గా పనిచేసి మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు.

దోమల నివారణకు ఫ్రైడే, డ్రైడే పాటిద్దాం


ఫ్రైడే డ్రైడే పాటించాలని కోరుతూ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫ్రైడే డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఎన్‌టీఆర్ జంక్షన్ పరిధిలో 17వ వార్డు కొత్తగూడెంలో వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించాలన్నారు. దోమలను నిర్వీర్యం చేయడం ద్వారా దోమకాటుకు గురికాకుండా చూసుకోవచ్చునని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో దోమ గుడ్లు పెడుతుందని, లార్వా నుంచి దోమగా మారేందుకు 10 రోజులు సమయం పడుతుందని వివరించారు. ప్రతి వారం నీటి నిల్వ ఉన్న తొట్లు, బానలు, డ్రమ్ములను శుభ్రం చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరి, లక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ హాకీలో సత్తాచాటిన విద్యార్థులు


స్టేట్ లెవెల్ రోలర్ స్కేటింగ్ హాకీ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

తణుకు అర్బన్‌: గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ లెవెల్ రోలర్ స్కేటింగ్ హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో తణుకు మాంటిస్సోరీ స్కూలు విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించినట్లు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. ఈనెల 6 నుంచి 8 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న 20 మందిలో కేడెట్ 7 నుంచి 11 ఏళ్లలోపు విభాగంలో ఏడుగురు విద్యార్థులు రెండవ స్థానంలో, సబ్ జూనియర్స్ 11 నుంచి 14 ఏళ్లలోపు విభాగంలో 9 మంది రెండవ స్థానంలో నిలిచి రజత పతకాలు సాధించినట్లు వివరించారు. వీరిలో ఎంపికయ్యే విద్యార్థులు డిసెంబరు 4న కొయంబత్తూరులో నిర్వహించే నేషనల్ లెవెల్ రోలర్ స్కేటింగ్ హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులతోపాటు కోచ్ ఎ.భార్గవ్‌ను డైరెక్టర్ ప్రకాశరావు అభినందించారు.

నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


తణుకులో మాట్లాడుతున్న నాగరాజు, చిత్రంలో సంఘ నాయకులు

తణుకు అర్బన్‌: భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ పిలుపునిచ్చారు. శనివారం తణుకు సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికల ముందు భవన నిర్మాణ రంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించి అమలుచేసిన ఇసుక పాలసీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని, సిమెంట్, ఐరన్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని ఈ కారణంగా నిర్మాణరంగం కుదేలై కార్మికులకు పనుల్లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం పరిష్కారం చూపాలని, వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధరించాలని, నిర్మాణాలపై వసూలు చేసిన సెస్సును భవన నిర్మాణరంగ కార్మికులకు ఖర్చు చేయాలని, వెల్ఫేర్ బోర్డులో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని, ఇసుక విధానానికి శాస్వత పరిష్కారం చూపాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మైలవరం శ్రీరాంబాబు, ఏడిద గోపాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడే సాయిబాలాజీ, రాసాబత్తుల అనుకుమార్, వెన్నభక్తుల నాగేశ్వరరావు, తణుకు, వేల్పూరు, రేలంగి సంఘాల అధ్యక్షులు కొక్కిరిమెట్టి సత్తిబాబు, బండారు కోట నాగేశ్వరరావు, బళ్ల శ్రీనివాస్, గోపాలకృష్ణ, తణుకు ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి బళ్ల నాని, తణుకు కార్పెంటరీ సంఘ అధ్యక్షుడు శేషగిరి, పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్, ఐరన్ సంఘ అధ్యక్షుడు బాబూరావు, టైల్స్ యూనియన్ నాయకులు శివ, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలో ప్రతిభ


చిత్రలేఖనం పోటీలో ప్రథమ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థినులు

తణుకు టౌన్‌: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తణుకు రూరల్ మండలం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ, తృతీయ బహుమతులు సాధించినట్లు హెచ్ఎం ఎం. ఏడుకొండలు తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గత నెలలో ఆడ పిల్లలను రక్షించండి అనే నినాదంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో తణుకు పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జీ దివ్యలహరి ప్రథమ, జే ఉమ నిఖిల తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. విజేతలకు కలెక్టర్ నాగరాణి ప్రసంశా పత్రాలతో పాటు మొదటి బహుమతి విజేతకు రూ.5 వేలు, తృతీయ బహుమతి విజేతకు రూ.2 వేలు నగదు పారితోషికంగా అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను హెచ్ఎంతోపాటు, ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి, ఏసు కృప, రామకృష్ణ, ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.